క్లుప్తంగా

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన



ఉండిలో కోలాటం నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: స్థానిక పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం వద్ద టీటీడీ దేవస్థానం దాస సాహిత్య ప్రాజెక్టు సంస్థ ఆధ్వర్యంలో గురువారం రాత్రి కోలాట కార్యక్రమాన్ని నిర్వహించారు. హనుమద్ జయంత్యుత్సవ కార్యక్రమాల్లో భాగంగా టీటీడీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఉప్పులూరు ఎంపీటీసీ సభ్యుడు, కోలాట నిర్వహకుడు నిమ్మల కేశవకుమార్ తెలిపారు. కోలాటం ఆద్యంతం ఆసక్తిగా ఉండటంతో భక్తులు, ప్రయాణికులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. హనుమద్ జయంతి వేడుకల ముగింపు కార్యక్రమంలో భాగంగా ఈ నెల 24న ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వహకులు తెలిపారు.

మాజీ ఎంపీటీసీ సభ్యురాలి మృతి



సత్యనారాయణమ్మ

వీరవాసరం: మండలంలోని రాయకుదురు మాజీ ఎంపీటీసీ సభ్యురాలు కడలి సత్యనారాయణమ్మ(67) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. బెంగళూరులో ఉంటున్న ఆమెకు స్వల్ప అస్వస్థతగా ఉండడంతో హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వైద్య చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డారని కుటుంబ సభ్యులు తెలిపారు. నారాయణమ్మ గతంలో రాయకుదురు -2 ఎంపీటీసీ సభ్యురాలిగా, అలాగే ఏఎంసీ డైరెక్టర్ గా పని చేశారు. ఈమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. నారాయణమ్మ మృతిపై ప్రముఖులు సంతాపం తెలిపారు.

ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



గొరగనమూడిలో ఉపాధి కూలీలతో వైద్య సిబ్బంది

పాలకోడేరు: వేసవికాలంలో వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. గొరగనముడి పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న ఎన్ఆర్ఈజీఎస్ కూలీల వద్దకు వెళ్లి వడదెబ్బ వల్ల కలిగే ఇబ్బందులపై, ఓఆర్ఎస్ ప్యాకెట్ల ప్రాముఖ్యతపై, ఆరోగ్య భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని గొరగనముడి వైద్య సిబ్బంది గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఎండ వల్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, వేసవిలో తీసుకోవాల్సిన ఆహార పానీయాల గురించి వివరించారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లను కూలీలకు అందించారు ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ సుజాత, ఎంఎల్‌హెచ్‌పీ రమోల, ఆరోగ్య సహాయకుడు ఎం.విజయ ప్రసాద్, ఏఎన్ఎం వేదకుమారి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



బేతపూడిలో సచివాలయ ప్రారంభోత్సవ శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి



తాడేరు క్రాస్‌బండ్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం అర్బన్: రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని తలచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వారి సంక్షేమం కోసం అనేక పథకాలు రూపొందించి అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని తాడేరు గ్రామంలో గురువారం రూ. 21లక్షల 80 వేల నిధులతో రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో నాడు, నేడు కూడా రైతులను ఆదుకున్నది వైఎస్సార్ కుటుంబమేనని అన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే రైతుల విద్యుత్ బకాయిలను, రుణమాఫీని ఒక్క సంతకంతో మాఫీ చేశారని గుర్తు చేశారు. నేడు ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులను ఆదుకోవడంతో మరో రెండడుగులు ముందుకేసి అనేక సంక్షేమ పథకాలును అమలు చేస్తున్నారన్నారు. ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి నాణ్యమైన ఎరువులు, సబ్సిడీకే విత్తనాలు, ఆధునిక టెక్నాలజీ అందిపుచ్చుకునేందుకు కియోస్క్ యంత్రాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు వ్యవసాయ పరిజ్ఞానాన్ని అందించి అధిక దిగుబడి సాధించేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఆర్‌బీకే సెంటర్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేసిన నామన మహేష్, కోమటి రాంబాబు, పెంటపాటి నానాజీ, బండి శక్తీశ్వర సాంబమూర్తి, సంబలదీవి గణేష్‌లను, స్థల దాతలైన బండి వీర వెంకట నాగ సత్యప్రసాద్, పెనుకుదురు సీతయ్య, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, వెంకటరత్నం సూర్యనారయాణలను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఘనంగా సత్కరించారు.

ప్రతి ఇంటి ముంగటకే ప్రభుత్వ పాలన

దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థను తీసుకు వచ్చి ప్రతి ఇంటి ముంగటకే సంక్షేమ పాలనను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శ ముఖ్యమంత్రి నిలిచారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని బేతపూడి గ్రామంలో రూ. 40 లక్షలతో నిర్మించిన సచివాలయాన్ని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతిపిత మహాత్మాగాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని స్థాపించే దిశంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేవివిధ శాఖల సిబ్బందిని నియమించి ప్రతి 50 కుటుంబాలకు వలంటీర్ పెట్టి అవినీతి అక్రమాలకు తావు లేకుండా సంక్షేమ పాలనను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ కోటిపల్లి బాబు, జిల్లా ఎంపీపీల ఛాంబర్ అధ్యక్షులు పేరిచర్ల విజయనరసింహరాజు, జెడ్పీటీసీ సభ్యుడు కాండ్రేగుల నరింహరావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు తహసీల్దార్ వై. రవికుమార్, ఎంపీడీహో రామచంద్రప్రభు, జిల్లా వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ కొట్టి కుటుంబరావు, ఆర్‌బీకే ఛైర్మన్ కుర్రేళ్ల నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు కూరేళ్ల భూలక్ష్మి, కడియం వెంకటేశ్వరరావు, సమతం ఉమామహేశ్వరరావు, బుంగా ప్రహ్లాదుడు, సూర్య భస్కరరావు, చినిమిల్లి వెంకట్రాయుడు, కామన నాగేశ్వరరావు,అల్లూరి కృష్ణంరాజు, కోళ్ల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాడేరు వంతెన నిర్మాణ పనుల పరిశీలన

భీమవరం అర్బన్: భీమవరం గునుపూడి – తాడేరు గ్రామాల మధ్య గునుపూడి సౌత్ డ్రెయిన్ నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులు, డైవర్షన్ రోడ్డు, క్రాస్ బండ్ పనులను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం రాకముందే నిర్మాణ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ వెంట ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, జిల్లా ఎంపీపీ ఛాంబర్ అధ్యక్షుడు పేరిచర్ల విజయనరసింహరాజు, జెడ్పీటీసీ సభ్యుడు కాండ్రేగుల నరసింహరావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, జేసీఎస్ మండల కన్వీనర్ కోమటి రాంబాబు, గొట్టుముక్కల పద్మరాజు తదితరులు ఉన్నారు.

రాష్ట్రంలో ప్రభుత్వ విద్యకు మహర్దశ

డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు



ఎన్నార్పీ అగ్రహారంలో పదో తరగతి విద్యార్థులను సత్కరిస్తున్న డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్



విస్సాకోడేరులో ఆర్థిక సాయం అందిస్తున్న డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నరసింహరాజు

ఉండి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విధానాల వల్లనే రాష్ట్రంలో ప్రభుత్వ విద్యకు మహర్దశ పట్టిందని డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. గురువారం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలో గ్రామ సర్పంచ్ సూరవరపు కనకదుర్గ, వెంకటాచార్యులు ఆధ్వర్యంలో ఈ ఏడాది పదవ తరగతి పరీక్షల్లో విజయం సాధించిన వివిధ మండలాలలకు చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను పీవీఎల్ చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. ఉండి మండలం ఆదుర్తి మేరీరత్నం (554), కందికట్ల మేఘన(583),ఆకివీడు మండలం అల్లు ఓంసాయిస్వప్న (579),కాళ్ళ మండలం ముత్యం సౌజన్యమనోహరి(572), ఎన్నార్పీ అగ్రహారం జడ్పీ స్కూల్ ఫస్ట్ కుసుమే ఆగ్నేస్ (536)లను సత్కరించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన అనంతరం ప్రభుత్వ విద్యావ్యవస్థ బలోపేతానికి సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారన్నారు. అమ్మ ఒడి పథకం ద్వారా ప్రతీ విద్యార్థికి రూ.15 వేలు ప్రతీ ఏటా అందిస్తున్నారన్నారు. జగనన్న విద్యా కానుక ద్వారా విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, షూస్, సాక్స్‌లు, బెల్టు, టై, ఐడీ కార్డులు ఇవ్వడంతో పాటు యూనిఫాం కుట్టుకూలీ కూడా అందజేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, రాష్ట్ర డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, ఉండి ఉపసర్పంచ్ గొట్టుముక్కల కల్యాణ్ వర్మ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, కాళ్ల జెడ్పీటీసీ సభ్యుడు పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు దాసరి వెంకటకృష్ణ,యేడిద వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు మున్నలూరి సువర్ణలక్ష్మీ, బ్యాంక్ ఛైర్మన్ పేరిచెర్ల సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

విస్సాకోడేరులో..

పాలకోడేరు: విద్యార్థులు 20 ఏళ్ల కష్టపడి చదువుకుంటే ఉన్నత శిఖరాల అధిరోహించి సమాజంలో గౌరవం దక్కడమే కాకుండా మిగతా 80 ఏళ్లు సుఖపడవచ్చునని డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నరసింహరాజు ఉద్బోధించారు. పాలకోడేరు మండలంలోని విస్సాకోడేరు గ్రామంలో పదో తరగతి పరీక్షల్లో మండల స్థాయిలో ప్రథమ స్కూల్ స్థాయిలో ద్వితీయ, తృతీయ స్థానాలతో ఉత్తీర్ణులైన విద్యార్థులు పి.లతా నాగశ్రీ (567), జి శ్రీ అఖిల (536), ఎ.యోగ లక్ష్మీ ప్రసన్న (523)లను ఘనంగా సన్మానించారు. ప్రథమ స్థానం సాధించిన విద్యార్థినిని సర్పంచ్ బొల్లా శ్రీనివాస్ రెండేళ్లు తాను తిరుమల విద్యా సంస్థల్లో ఉచితంగా చదివిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయలు జి.మణి, ఎం.లలిత తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఆదుకోవడమే మానవత్వం

ఆపద లో ఉన్న వారిని ఆదుకోవడం మానవత్వముని, మానవతా దృక్పథంతో మృతి చెందిన అన్వేష్ కుటుంబానికి కు సహకారం అందించడం చాలా గొప్ప విషయమని డీసీసీబీ ఛైర్మన్ పీవీల్ నరసింహరాజు అన్నారు. విస్సాకోడేరులో ఇటీవల కాన్పుకు పుట్టింటింటికి వెళ్లి వచ్చిన సమయంలో ఆమె భర్త పాలూరి అన్వేష్ విద్యుదాఘాతంతో మృతి చెందడం, ముగ్గురు చంటి పిల్లలతో అనాథగా మారడం తో సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, డ్వాక్రా సీఏలు అందరూ కలిసి గురువారం రూ.48 వేల నగదు సేకరించి, పీవీల్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పీవీల్ మాట్లాడుతూ ఏదైనా ఉద్యోగం చూసుకుంటే తాను సిఫార్సు చేసి ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్ బొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలోని వలంటీర్ గా పని చేస్తున్న ధనలక్ష్మి భర్త విద్యుత్ షాక్ తో అకాల మరణం చెందడంతో ఆ కుటుంబానికి ఆసరాగా నిలిచిన సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, డ్వాక్రా సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెన్మత్స శ్రీనివాసరాజు, దుండి అశోక్ బాబు, పిన్నంరాజు సహదేవరాజు, కందుల నాగరాజు, గెద్దం జోషి మండల పరిషత్ కోఆప్షన్ సభ్యురాలు డాక్టర్ డీఆర్ స్వర్ణలత, ఎంపీటీసీ సభ్యుడు బొల్లం గాంధీ, నాయకులు పిన్నం రాజు పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఉండి: ఉండి కో ఆపరేటివ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు గురువారం ప్రారంభించారు. బ్యాంక్ అధ్యక్షుడు పేరిచెర్ల సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పీవీఎల్ మాట్లాడుతూ దాతలు సమాజిక భాధ్యతతో ముందుకు వచ్చి చలివేంద్రాలు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ త్రిసభ్య కమిటీ సభ్యులు కరిమెరక శివనాగరాజు, చిట్టూరి రత్నరాజు, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, గులిపల్లి అచ్చారావు, ఉపసర్పంచ్ గొట్టుముక్కల కల్యాణ్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు



కోపల్లె గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: గ్రంథాలయాలు జ్ఞాన సముపార్జనకు కేంద్రాలని, ప్రతి ఒక్కరూ వినియోగించుకొని విజ్ఞానం పొందాలని గ్రంథాలయ అధికారిణి కె.స్వరూపారాణి అన్నారు. గురువారం కోపల్లె గ్రంథాలయంలో స్థానిక పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిశిక్షణ శిబిరంలో భాగంగా ప్రతీ రోజు విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. వేసవిలో విద్యార్థులు చెడు మార్గాల బాట పట్టకుండా పుస్తక పట్టణాన్ని అలవాటు చేసుకోవడం ద్వారా విజ్ఞానాన్ని పొందవచ్చన్నారు.

భీమవరంలో..

సాక్షి, భీమవరం: స్థానిక డాక్టర్ వైఎస్సార్ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం యోగాపై అవగాహన కల్పించారు. యోగా గురువు కలిగొట్ల గోపాల శర్మ మాట్లాడుతూ ప్రాణయామం చేయడం వలన శ్వాస నియంత్రణలో ఉంటుందన్నారు. మెడిటేషన్ చేయడం వల్ల ఉత్సాహంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో చదువరుల సంఘం అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం, చెరుకువాడ రంగసాయి, డి.రామ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

ఉండిలో..

ఉండి: స్థానిక శాఖాగ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా గురువారం పచ్చదనం దాని ప్రయోజనాలు అనే అంశంపై గ్రంథాలయ అధికారి జేవీ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మొక్కలు నాటి వాటిని పెంచడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. పచ్చదనంతో కళకళలాడే వాతావరణంలో అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు.

వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

పోడూరు: వెటర్నరీ అసిస్టెంట్స్ సర్జన్స్ వీఏఎస్)జిల్లా కార్యవర్గం అధ్యక్షునిగా పోడూరు మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎస్.మహేష్‌కుమార్ ఎన్నికయ్యారు. భీమవరంలోని జిల్లా జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో గురువారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా సిద్ధాపురం వీఏఎస్ డాక్టర్ భార్గవి సత్య, ఉపాధ్యక్షులుగా ఆలమూరు వీఏఎస్ డాక్టర్ రవి కాంత్, సహాయ కార్యదర్శిగా మోగల్లు వీఏఎస్ డాక్టర్ ప్రియాంక రాబర్ట్స్, కోశాధికారిగా దగ్గులూరు వీఏఎస్ డాక్టర్ వర ప్రసాద్ ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని పశువైద్యులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఆగర్రులో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

పాలకొల్లు అర్బన్: బాబా సాహెబ్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు యువతరానికి ఆదర్శం కావాలని శాసన మండలి సభ్యులు కవురు శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లు మండలం ఆగర్రు శివారు మైజారుగుంటలో నూతనంగా నిర్మించిన బాబా సాహెబ్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సాకా గంగారత్నం అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలోని యువత విద్యావంతులు కావాలన్నారు. చదువుకుంటే ఉన్నత భవిష్యత్ ఏర్పడుతుందని గుర్తించాలన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ గంగారత్నాన్ని యువజనుల తరపున ఎమ్మెల్సీ శ్రీనివాస్ శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, ఆర్డీఓ దాసి రాజు, మండల కోఆప్షన్ సభ్యులు తండా ఇస్సాక్‌రాజు, ఎం.మైఖేల్‌రాజు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పీవీఎల్ నరసింహరాజు

కాళ్ల: అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నరసింహరాజు తెలిపారు. ఈ మేరకు కాళ్ల మండలం పెద్ద అమీరం పార్టీ కార్యాలయం గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హజ్ యాత్రకు వెళ్లే ముస్లిం సోదరులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిధులు మంజూరు చేసి యాత్రకు సహకరించడం అభినందనీయమని ఆయన అన్నారు. జగన్ మోహన్ రెడ్డి పాలనలో ముస్లింలకు ప్రత్యేక స్థానం ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రి నిర్ణయానికి రాష్ట్రంలో ముస్లిం సోదరులంతా ఎంతో ఆనందంగా ఉన్నారని స్పష్టం చేశారు. యాత్ర కు వెళ్ళేందుకు ఒక్కొక్కరికి రూ 80,000 విడుదల చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో భాగంగా ముస్లిం సోదరులతో కలిపి పీవీఎల్ నరసింహరాజు ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మహమ్మద్ మదిని, జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండి జహంగీర్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ జక్కి, ఎండీ సిద్దిక్, మాబు, ఎండీ బిలాల్, ఎండీ ఆలీ, షేక్ హుస్సేన్, కన్నా సాహెబ్, హర్షద్ అహ్మద్, షేక్ మీరా సాహెబ్, షేక్ మస్తాన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి అందజేత

సీఎం సహాయ నిధి పేద రోగులకు ఒక వరం లాంటిదని డీసీసీబీ ఛైర్మన్ పి వి ఎల్ నరసింహరాజు తెలిపారు. కాళ్ల మండలం పెదఅమిరం గ్రామంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయం నందు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఉండి నియోజకవర్గానికి చెందిన ఇద్దరు బాధితులకు రూ.1.90 లక్షల చెక్కులను అందించారు. పాలకోడేరు మండలం మోగల్లు గ్రామానికి చెందిన నడింపల్లి సూర్యకాంతమ్మకు రూ.1.20 లక్షలు, ఉండి మండలం పెదపుల్లేరు గ్రామానికి కారణం వెంకటేశ్వరరావు రూ.70,000 చెక్కులను అందజేశారు.

భక్తులతో నత్తారామేశ్వరం కిటకిట

పెనుమంట్ర: వైశాఖమాసం ముగింపు మాసశివ రాత్రి పర్వదినం సందర్భంగా గురువారం నత్తారామేశ్వరం గ్రామంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఎండతీవ్రతను కూడా లెక్కచేయకుండా రామేశ్వరస్వామిని, రామలింగేశ్వరస్వామిని దర్శించుకునేందుకు బారులుతీరారు. గోస్తనీ గర్భంలో ఉన్న పరుశురామ ప్రతిష్ఠ శ్రీ రామలింగేశ్వరస్వామి వైశాఖమాసంలో నెల రోజుల మాత్రమే దర్శనమివ్వడంతో గురువారం ఆఖరి రోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో అభిషేకం మండపంలో పెద్ద సంఖ్యలో రుద్రాభిషేకాలు జరిగాయి. అనంతరం స్వామి వారికి పల్లకిసేవ నిర్వహించారు. శుక్రవారం నుంచి గోస్తనీలో స్వామి వారు జలదివాసంలోకి వెళ్లిపోవడంతో మళ్లీ ఏడాది వరకూ ఆయన దర్శన భాగ్యం ఉండదు. ఆలయానికి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులకు పాలి గ్రామానికి చెందిన మేడపాటి రామచంద్రారెడ్డి, లక్ష్మి దంపతులు, హైదరాబాద్ కు చెందిన సత్తి శ్రీరామారెడ్డి, కనకదుర్గా దంపతులు ప్రసాద వితరణ చేశారు. అదే విధంగా ఆలయానికి వచ్చిన భక్తులకు స్థానిక యూత్ ఆధ్వర్యంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు.

రైతులపై టీడీపీది కపట ప్రేమ

పెనుగొండ: అధికారంలో ఉన్నప్పుడు వ్యవసాయాన్ని దండగని వ్యాఖ్యానించిన టీడీపీ, నేడు రైతులపై కపట ప్రేమ చూపిస్తుందని...రైతుల సంక్షేమం కోసం ఆహర్నిశలు కృషి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రమేనని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మేడపాటి సాయి చంద్రమౌళీశ్వరరెడ్డి అన్నారు. గురువారం తూర్పుపాలెంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రకతి వైపరీత్యంతో ఇబ్బందులు పడుతున్న రైతన్నలకు సీఎం జగన్‌తో పాటు, నియోజకవర్గంలో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అండగా నిలిచారన్నారు. స్థానిక టీడీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు ఏనాడు రైతుల సమస్యలూ పట్టించుకోలేదని, వరి చేలోకి దిగిన సంఘటనలూ లేవన్నారు. కాని, నేడు ఆర్భాటం చేస్తు రైతులను మభ్య పెట్టడానికి నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఎన్ని చేసినా రైతులు వారిని నమ్మే స్థితి లేకపోవడంతో మతి కోల్పోయి మాట్లాడుతున్నారన్నారు. టీడీపీ నేతలు ఇప్పటికైనా వాస్తవాలు అంగీకరించాలని హితవు పలికారు. గుంటూరు పెద్దిరాజు, పూతినీడి వెంకటేశ్వరరావు, సుంకర సీతారామ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సాక్షి, భీమవరం: స్థానిక 132/33 కెవి ఈహెచ్‌టీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం 19వ తేది శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. భీమవరం రూరల్, భీమవరం టౌన్, పాలకోడేరు, వీరవాసరం మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

డీఎస్పీ ఆకస్మిక తనిఖీ

ఉండి: ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని భీమవరం డీఎస్పీ బి.శ్రీనాథ్ అన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఉండి పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ప్రతీ పోలీస్ స్టేషన్‌లో ఉన్న సిబ్బంది కొరతను తీర్చేందుకు త్వరలోనే నియామకాలు జరుగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్సై కె.గంగాధరరావు,సిబ్బంది పాల్గొన్నారు.

సోమేశ్వరునికి మామిడి పండ్లతో అలంకరణ



ప్రత్యేకాలంకరణలో సోమేశ్వరస్వామి

సాక్షి, భీమవరం: పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న శ్రీ పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో వైశాఖ మాస మాస శివరాత్రి సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు వెలివెల రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, పంచామృతాలతో మహన్యాస అభిషేకం చేశారు. అనంతరం సుమారు 500 మామిడ పండ్లతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

విశాఖ యాత్రకు ప్రత్యేక బస్సులు

నరసాపురం: వేసవిలో ఆహ్లాదకరంగా విహార యాత్ర చేసేందుకు వీలుగా ప్రతీ శనివారం నరసాపురం డిపో నుంచి విశాఖపట్నానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్. సుబ్బన్నరెడ్డి చెప్పారు ప్రతీ శనివారం ఉదయం 9 గంటలకు నరసాపురం బస్ స్టేషన్ నుంచి బస్సు బయలుదేరుతుందని చెప్పారు. సింహాచలం, కైలాసగిరి, హుడాపార్కు, నేవీ మ్యూజియం, సబ్‌మెరైన్‌బీచ్, ఆర్కేబీచ్, కాళీ టెంపుల్ ఇలా 7 ప్రదేశాలను సందర్శించేలా ఏర్పాటు చేశామన్నారు. శనివారం బయలుదేరిన బస్సు మళ్లీ సోమవారం ఉదయం గమ్యస్థానానికి చేరుకుంటుందని చెప్పా రు. పెద్దలకు రూ.1110, పిల్లలకు రూ.850 చార్జీ నిర్ణయించినట్టు చెప్పారు. రిజర్వేషన్ సౌకర్యం ఉందని, ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

ఘనంగా జాజులమ్మ జాతర

నరసాపురం రూరల్: మండలంలోని తెలగంసెట్టివారి మెరకలోఉన్న జాజులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 16న ప్రారంభమైన అమ్మవారి జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ముగింపు వేడుక లను పురస్కరించుకుని శుక్రవారం ఆలయం వద్ద అఖండ అన్న సమారాధనను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.